క్లుప్తంగా

ఎమ్మెల్యే రమణమూర్తిరాజు పర్యటన నేడు

రాంబిల్లి : ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు(కన్నబాబు) గురువారం రాంబిల్లి, లాలంకోడూరు గ్రామాల్లో పర్యటించనున్నారు. లాలంకోడూరులో భూ పట్టాలు పంపిణీ కార్యక్రమంలోనూ, రాంబిల్లిలో వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమంలోనూ పాల్గొననున్నారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎంపీడీవో కొండలరావు కోరారు.

27 నుంచి సామాజిక తనిఖీ గ్రామసభలు

కోటవురట్ల : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులపై ఈ నెల 27వ తేదీ నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు తెలిపారు. 25 గ్రామ పంచాయతీల పరిధిలో సామాజిక తనిఖీ పూర్తి కాగా గ్రామసభల ద్వారా గుర్తించిన అంశాలను వివరిస్తారని తెలిపారు. ఈ గ్రామసభలు ఫిబ్రవరి 5వ తేదీ వరకు జరుగుతాయని, 6న ప్రజావేదిక జరుగుతుందని తెలిపారు. రైతులు, కూలీలు గ్రామసభలకు హాజరు కావాలని కోరారు.

బ్యాడ్మింటన్‌లో పాయకరావుపేట జట్టు విజయం



బ్యాడ్మింటన్ పోటీల్లో విజయం సాధించిన జట్టుతో నిర్వాహకులు

పాయకరావుపేట : ఆడుదాం – ఆంధ్రా క్రీడల పోటీల్లో బ్యాడ్మింటన్‌లో పాయకరావుపేట జట్టు విజయం సాధించినట్టు ఎంపీడీవో ఎ.సాంబశివరావు తెలిపారు. నియోజకవర్గ స్థాయి పోటీల్లో కోటవురట్ల జట్టుకు, పాయకరావుపేట రెండో సచివాలయం జట్టుకు మధ్య పోటీ జరిగింది. ఈ పోటీలో గెలుపొందిన పాయకరావుపేట సచివాలయం 2 జట్టును మండల విద్యాశాఖాధికారి కె.ఎస్.గాంధీ, గ్రామ సచివాలయ కార్యదర్శి జె.చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది అభినందించారు.

ఘనంగా లోవాంబిక అమ్మవారి తీర్థం

రాంబిల్లి : గోకివాడలో బుధవారం లోవాంబిక అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, సర్పంచ్ నీరుకొండ శారద, ఏపీటీఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షులు ఎస్.వి.సూర్యనారాయణ, ఎంపీటీసీ అల్లవరపు బాబ్జితో పాటు అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ శారద దంపతులు చిడతలు బృంద సభ్యులకు చిడతలు ఎంపీపీ గోవింద్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా గోవింద్ మాట్లాడుతూ, తీర్థాలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తాయన్నారు.

వాలీబాల్ పోటీల విజేత గోకివాడ



క్రీడాకారులను అభినందిస్తున్న సూర్యనారాయణ

రాంబిల్లి: ఆడుదాం ఆంధ్ర యలమంచిలి నియోజకవర్గ వాలీబాల్ పోటీల్లో గోకివాడ జట్టు విజేతగా నిలిచింది. మంచి ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచిన జట్టు క్రీడాకారులను గ్రామ నాయకుడు, ఏపీటీఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎస్.వి. సూర్యనారాయణ అభినందించారు. తమ గ్రామ క్రీడాకారుల విజయం పట్ల సర్పంచ్ నీరుకొండ శారద హర్షం వ్యక్తం చేశారు.

31న గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపు

మునగపాక : మండల కేంద్రంలో వచ్చే నెల 3న గౌరీ పరమేశ్వరుల ఉత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఏటా క్రమం తప్పకుండా ఫిబ్రవరి తొలి శనివారం ఉత్సవాన్ని నిర్వహించడం అనవాయితీగా వస్తుందన్నారు. ఈ ఏడాది కూడా అందరి సహకారంతో ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ నెల 31న సాయంత్రం 4 గంటల నుంచి సారె ఊరేగింపు నిర్వహిస్తున్నామని, భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

అక్కచెల్లెమ్మలకు అండగా...ఆసరా

- వరుసగా నాలుగో ఏడాది వైఎస్సార్ ఆసరా నిధుల జమ
- రూ.రూ12.33 కోట్ల చెక్కు పంపిణీ



హోమ్‌ఫుడ్స్ స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

యలమంచిలి : మహిళా సాధికారతతోనే రాష్ట్ర పురోగతి సాధ్యమని యలమంచిలి ఎమ్మెల్యే యు.వి రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. బుధవారం యలమంచిలి మున్సిపల్ కార్యాలయంలో వైఎస్సార్ ఆసరా కింద నాలుగో విడత నగదు పంపిణీ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు) మాట్లాడుతూ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. 2019 ఏప్రిల్ 11 నాటికి స్వయం సహాయక సంఘాల్లోని అక్క చెల్లెమ్మలకు బ్యాంకుల్లో ఉన్న రుణాలను నాలుగు వాయిదాల్లో తాము నేరుగా చెల్లిస్తామని ఇచ్చిన మాటను సీఎం జగన్ దిగ్విజయంగా పూర్తి చేశారని అన్నారు. ఈ పథకం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల్లోని పేద మహిళల ఆర్థిక పురోగతికి దోహదపడుతుందని అన్నారు. యలమంచిలి మండలంలో నాలుగో విడత రూ.12.33 కోట్ల చెక్కును అందజేయడం జరుగుతుందని, నియోజకవర్గంలో నాలుగు మండలాలు కలిపి సుమారు రూ.200 కోట్ల వరకు డ్వాక్రా రుణాలు అందించడం జరిగిందని, రైతులు, మహిళలు చిరువ్యాపారాలకు ఈ రుణాలు ఎంతో ఉపయోగపడ్డాయని అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి మాట్లాడుతూ యలమంచిలి పట్టణం, గ్రామీణంలో స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలకు నాలుగు విడతల్లో రూ.50 కోట్ల వరకు రుణాలు ప్రభుత్వం ద్వారా అందించడం జరిగిందని తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రతి కుటుంబంలో వారి జీవనోపాధికి దోహదపడిందని, ప్రజలందరూ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలు చూసి రానున్న ఎన్నికల్లో మళ్లీ ఆయనను ఆశీర్వదించాలని కోరారు. అంతకు ముందు ఎమ్మెల్యే రమణమూర్తిరాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, ఎంపీపీ గోవింద్, మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు యర్రయ్యదొర జ్యోతి ప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆసరాతో ఉపాధి పొందుతున్న మెప్మా అర్బన్ మార్కెట్ ద్వారా ఉపాధి ఏవిధంగా పొందుతున్నారో, హోమ్‌ఫుడ్స్, లక్కబొమ్మల స్టాల్స్‌ను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు జగనన్నకు కృతజ్ఞతలు తెలుపుతూ కోలాటం ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ ఎస్.సరోజిని, మున్సిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరావు, మున్సిపల్ కమిషనర్ కె.కొండబాబు, ఎంపీడీవో అప్పలనాయుడు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు షేక్ సయ్యిద్ బీబీ, వెలుగు ఏపీఎం రాణి, మెప్మా అధికారి పద్మావతి, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

ఆసరా ఉపాధిని చూపింది



గతంలో ఉపాధి లేక ఆర్థికంగా ఇబ్బందులు పడేవాళ్లం. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ఇంటి దగ్గరే ఉండి ఉపాధి పొందేందుకు ఎంతో ఉపయోగపడింది. ప్రస్తుతం సొంతంగా ఇంటి వద్దే హోమ్‌ఫుడ్స్ తయారీ చేసుకుంటూ ఉపాధి పొందుతున్నాను. భర్తకు ఎంతో చేదోడుగా నిలుస్తున్నాను. జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మహిళలకు ఆర్థికంగా చేయూత కలిగింది ఎంతో సంతోషంగా ఉంది.

– వైబోయిన కృష్ణవేణి, గుంద్రుబిల్లి

సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం

- ఎంపీ డాక్టర్ సత్యవతి
- ఏటికొప్పాకలో రూ.10 లక్షలతో నిర్మించిన గ్రావెల్ రోడ్డుకు ప్రారంభోత్సవం



రోడ్డును ప్రారంభిస్తున్న ఎంపీ సత్యవతి, ప్రజాప్రతినిధులు

యలమంచిలి రూరల్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యమిస్తున్నారని అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి అన్నారు. బుధవారం యలమంచిలి మండలం ఏటికొప్పాకలో రూ.10 లక్షల ఎంపీ ల్యాడ్స్ నిధులతో నిర్మించిన గ్రావెల్ రోడ్డును ఆమె ప్రారంభించారు. గ్రామంలో సుమారు 760 మీటర్ల పొడవున ఈ రోడ్డును నిర్మించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అభివృద్ధి విషయంలో ప్రతిపక్ష పార్టీలు చేస్తున్నదంతా అసత్య ప్రచారమేనన్నారు. మళ్లీ జగన్‌ను గెలిపిస్తే రాష్ట్రంలో స్వర్ణయుగం వస్తుందని అన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, జెడ్పీటీసీ సంధ్యారాణి, రాము, యలమంచిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యర్రయ్యదొర, సర్పంచ్ భజంత్రుల లక్ష్మి, మండల ఇంజినీర్ సోమశేఖర్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు త్రినాథ్, స్కూల్ కమిటీ చైర్మన్లు మొల్లేటి ప్రసాద్, రమణ, ఉపసర్పంచ్ సింహాచలం పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీతో పేదలకు ఆరోగ్య సిరి



కె.వెంకటాపురంలో ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ రత్నం



ఒంపోలులో ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న దృశ్యం

కోటవురట్ల: ఆరోగ్యశ్రీ పథకంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన మార్పులతో పేదలకు ఆరోగ్య భద్రత కలిగిందని వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్ అన్నారు. కె.వెంకటాపురంలో ఆరోగ్యశ్రీ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. రమేష్ మాట్లాడుతూ మహానేత, వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పేదలకు సంజీవనిగా మారిందన్నారు. ఆ తర్వాత టీడీపీ ప్రభుత్వం పథకాన్ని నీరుకార్చగా మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పునర్జీవం వచ్చిందన్నారు. ఈ పథకాన్ని మరింత మార్పు చేసి సుమారు 2 వేల వ్యాధులకు రూ.25 లక్షల వరకు చికిత్స పొందేలా ప్రజలకు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కళ్ల రత్నం, గ్రామ పెద్దలు, లబ్ధిదారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

మునగపాక : ప్రతి ఒక్కరూ ఆరోగ్య శ్రీ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బొద్దపు శ్రీరామమూర్తి కోరారు. ఒంపోలు సచివాలయంలో బుధవారం ఆయన ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. మహానేత రాజశేఖరరెడ్డి ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి పేదల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని, ఆయన ఆశయ సాధనకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తూ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25లక్షలకు పెంచారని అన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి విమలగిరి, ఏఎన్ఎం జ్యోతి, వైద్య సిబ్బంది జగన్నాథరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు చక్కని అవకాశం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు



వాలీబాల్ ఆడుతున్న మహిళలు

- ఎమ్మెల్యే రమణమూర్తిరాజు
- రసవత్తరంగా నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలు

యలమంచిలి : నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు బుధవారం యలమంచిలి రాజీవ్ క్రీడా మైదానంలో రసవత్తరంగా సాగాయి. అంతకు ముందు ఎమ్మెల్యే రమణమూర్తిరాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్‌వర్మ, ఎంపీపీ బోదెపు గోవింద్, మార్కెట్ కమిటీ చైర్మన్ యర్రయ్యదొరతో కలసి పోటీలను రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు నియోజకవర్గంలో నాలుగు మండలాల నుంచి వచ్చిన జట్లను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడల ద్వారా నియోజకవర్గంలోని క్రీడాకారులు తమ ప్రతిభ నిరూపించుకుని జిల్లా , రాష్ట్ర స్థాయి క్రీడల్లో రాణించడానికి అవకాశం కల్పిస్తుందన్నారు. బుధవారం ఇక్కడ మైదానంలో పురుషులకు, మహిళలకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ క్రీడలు నిర్వహించారు. ఎంపీడీవో అప్పలనాయుడు , మున్సిపల్ కమిషనర్ కె.కొండలరావు, వ్యాయామ ఉపాధ్యాయులు, సచివాలయ అధికారులు పర్యవేక్షించారు. బాలుర కబడ్డీలో అచ్చుతాపురం మండలం జట్టు ప్రథమ స్థానం, రాంబిల్లి మండలం జట్టు ద్వితీయ స్థానం, మునగపాక మండలం జట్టు తృతీయ స్థానం పొందాయి. మహిళల కబడ్డీలో అచ్చుతాపురం ప్రథమ స్థానం, మునగపాక ద్వితీయ స్థానం, రాంబిల్లి తృతీయ స్థానం పొందాయి. పురుషుల ఖోఖో క్రీడలో అచ్చుతాపురం ప్రథమ, మునగపాక ద్వితీయ, రాంబిల్లి తృతీయ స్థానం పొందాయి. మహిళల ఖోఖో పోటీల్లో వరుసా మునగపాక, రాంబిల్లి, యలమంచిలి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి. పురుషుల వాలీబాల్‌లో రాంబిల్లి ప్రథమ, యలమంచిలి ద్వితీయ, అచ్చుతాపురం తృతీయ స్థానం సాధించాయి. మహిళల వాలీబాల్ పోటీల్లో అచ్చుతాపురం, యలమంచిలి, మునగపాక వరుసగా మూడు స్థానాలు దక్కించుకున్నాయని ఎంపీడీవో అప్పలనాయుడు బుధవారం సాయంత్రం తెలిపారు.

గౌతమ పఠన మందిరం వార్షికోత్సవాలు ప్రారంభం



స్కిప్పింగ్ పోటీల్లో పాల్గొన్న బాలికలు

మునగపాక : మండల కేంద్రంలో గౌతమ పఠన మందిరం 49వ వార్షికోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని వార్షికోత్సవాలను ఏటా ఘనంగా నిర్వహిస్తున్నారు. తొలిరోజున స్కిప్పింగ్, కుర్చీలాటలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. వేడుకల ముగింపు సందర్భంగా ఆదర్శ రైతు కుటుంబాలకు సత్కారం, భరతనాట్య ప్రదర్శన వంటి కార్యక్రమాలు జరుగుతాయని పఠన మందిరం అధ్యక్ష, కార్యదర్శులు దాడి సూరిబాబు, వెలగా శ్రీనివాసరావు సంయుక్తంగా తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మహిళలతో మ్యాజిక్ బస్ సంస్థ ఏఈ రమేష్

మునగపాక : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మ్యాజిక్ బస్ సంస్థ ఏఈ పాలకొండ రమేష్ కోరారు. మునగపాక జగనన్న కాలనీలో జాతీయ బాలికా దినోత్సవ సందర్భంగా మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, అక్షరాస్యత పెంచుకోవాలని అన్నారు. బాల్య వివాహాలు చట్టారీత్యా నేరమన్నారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా పురుషులతో సమానంగా ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ డీఏ జ్యోతి, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇన్నర్‌వీల్ వితరణ



అరబుపాలెంలో విద్యార్థులకు స్టీల్‌కంచాలు అందజేస్తున్న దృశ్యం

మునగపాక : విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని అరబుపాలెం సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు అన్నారు. అనకాపల్లికి చెందిన ఇన్నర్‌వీల్ సంస్థ సమకూర్చిన స్టీల్ కంచాలు, పెన్నులు, ఎరేజర్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. స్థానిక ఎంపీయూపీ స్కూల్లో నిర్వహించిన కార్యక్రమానికి సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు అతిథిగా హాజరై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అనకాపల్లి ఇన్నర్‌వీల్ సంస్థ సేవలు అభినందనీయమన్నారు. పాఠశాల హెచ్‌ఎం ఎం.వై.రాము ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు బొడ్డేడ బుజ్జి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కంబాల జోగులు



ఖోఖో విన్నర్స్ ఎస్.రాయవరం జట్టు



కబడ్డీలో మొదటి బహుమతి సాధించిన నక్కపల్లి జట్టు

- నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు

నక్కపల్లి/ఎస్.రాయవరం: రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రాలో భాగంగా నిర్వహిస్తున్న ఆటల పోటీలు పురుషుల విభాగంలో బుధవారం ముగిసాయి. నియోజకవర్గ స్థాయి పోటీలను ఎస్.రాయవరంలో నియోజకవర్గ సమన్వయకర్త రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ చిక్కాల రామారావు ప్రారంభించారు. ఖోఖో పోటీల్లో మొదటి బహుమతి ఎస్.రాయవరం, రెండో బహుమతి పాయకరావుపేట మండలం, మూడో బహుమతి నక్కపల్లి మండలం గెలుచుకున్నాయి. కబడ్డీలో నక్కపల్లి, కోటవురట్ల, ఎస్.రాయవరం, క్రికెట్‌లో పాయకరావుపేట, నక్కపల్లి, కోటవురట్ల, బ్యాడ్మింటన్‌లో పాయకరావుపేట, కోటవురట్ల, నక్కపల్లి వరుసగా మూడు స్థానాల్లో నిలవగా, వాలీబాల్‌లో కోటవురట్ల, పాయకరావుపేట, నక్కపల్లి వరుస మూడు స్థానాల్లో విజయం సాధించా యి. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి కంబాల జోగులు, రామకృష్ణ, రామారావు మాట్లాడారు. ఆడుదాం ఆంధ్ర పోటీల్లో బహుమతుల కింద రూ.10 వేల నుంచి 5 లక్షల వరకు ప్రకటించడం గొప్ప విషయమన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మహేష్, సర్పంచ్ సత్యనారాయణ, హెచ్ఎం షేక్ బేబీ,నాయకులు నాగ అప్పలరాజు, గొర్ల బాబూరావు, వ్యాయామ టీచర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



వాడ్రాపల్లిలో విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న సర్పంచ్ నూకరాజు



ట్యాబ్‌లు ప్రదర్శిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం : నాణ్యమైన విద్యను ప్రభుత్వ పాఠశాలల్లో అందించేందుకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని ఎం.జగన్నాథపురం మాజీ సర్పంచ్ భీముని వెంకటేశ్వరరావు అన్నారు. ఎం.జగన్నాథపురం ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. మధ్యాహ్నం భోజన పథకం అమలు తీరుని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రావి నాగలక్ష్మి శోభన్‌బాబు, స్కూల్ కమిటీ చైర్మన్ గొర్లె శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

మునగపాక : విద్యాభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు అన్నారు. వాడ్రాపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో 8వ తరగతి చదువుకుంటున్న విద్యార్థులకు బుధవారం బైజూస్ ట్యాబ్‌లను పంపిణీ చేశారు. విద్యార్థులు కష్టపడి చదువుకొని తల్లిదండ్రులకు, పాఠశాలలకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సురక్ష..పేదల ఆరోగ్యానికి భరోసా



వైద్య శిబిరంలో ఫార్మసీ కౌంటర్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి

యలమంచిలి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి అన్నారు. బుధవారం యలమంచిలి తులసీనగర్ కొత్త ఆస్పత్రి భవనంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. వైద్య శిబిరంలో ఏర్పాటు చేసిన సేవలు పరిశీలించిన ఆమె వైద్యులు, రోగులతో మాట్లాడారు. వైద్య శిబిరాల్లో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు ఇస్తారని ఆమె తెలిపారు. అవసరమైన రోగులకు ఆరోగ్యశ్రీ ద్వారా ఆస్పత్రుల్లో శస్త్రచికిత్సలు చేయిస్తున్నామన్నారు. అనంతరం రోగులకు మెడికల్ కిట్లు అందజేశారు. మొత్తం 362 మందికి శిబిరం ద్వారా వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కొండలరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వర్రావు, కో ఆప్షన్ సభ్యురాలు షేక్ సయ్యిద్ బీబీ పాల్గొన్నారు.

నేడు చందన అలంకరణలో నృసింహ స్వామి దర్శనం

అనకాపల్లి: గవరపాలెం దిబ్బవీధి లక్ష్మీ నృసింహస్వామి గురువారం చందన అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారని ఆలయ వర్గాలు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పుష్య పౌర్ణమిని పురస్కరించుకుని స్వామివారికి కవచాలంకరణ, స్వర్ణ సంపెంగ పుష్పాలతో అర్చన చేయనున్నామన్నారు. లక్ష్మీ ఆండాళ్ అమ్మవారికి పంచామృతాభిషేకాలు, సాయంత్రం దీపాలంకరణ సేవ నిర్వహిస్తామన్నారు.

మద్యం దుకాణంలో చోరీకి విఫలయత్నం



ప్రభుత్వ మద్యం దుకాణం పరిశీలిస్తున్న పోలీసులు

మునగపాక : స్థానిక మెయిన్‌రోడ్డులోని ప్రభుత్వ మద్యం దుకాణంలో ఆగంతకులు చోరీకి విఫలయత్నం చేశారు. రోజూ వలే మంగళవారం రాత్రి 11 గంటలకు విధులు ముగించి ఉద్యోగులు ఇంటికి వెళ్లిపోయారు. తరువాత కొందరు గుర్తు తెలియని వ్యక్తులు దుకాణంలోకి వెళ్లేందుకు యత్నించారు. గునపాం సాయంతో గేటును తొలగించేందుకు ప్రయత్నించారు. అయితే మెయిన్‌రోడ్డు పక్కనే కావడంతో రాకపోకలు సాగించేవారి జాడ కనిపించడంతో జారుకున్నారు. బుధవారం షాపు తెరిచేందుకు ఉద్యోగులు వచ్చే క్రమంలో చోరీ జరిగినట్టుగా భావించి పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్ఐ మన్మథరావు ఇతర పోలీసు సిబ్బంది దుకాణాన్ని పరిశీలించారు. అయితే దుకాణంలోని నగదు గాని, గే మద్యం బాటిళ్లు గాని చోరీకి గురికానట్టుగా గుర్తించారు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టిడ్కో లబ్ధిదారులకు పట్టాల పంపిణీ

అనకాపల్లి: పేదల సొంతింటి కలను నిజం చేసి, వారి కళ్లల్లో ఆనందం నింపిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత అన్నారు. పట్టణంలోని 3,4 సచివాలయాల పరిధిలో సత్యనారాయణపురం టిడ్కో గృహ లబ్ధిదారులకు బుధవారం ఆమె రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ వారు 2019 ఎన్నికల సమయంలో టిడ్కో గృహాల నిర్మాణాన్ని హడావిడిగా ప్రారంభించి, అసంపూర్తిగా నిలిపివేశారన్నారు. మహిళలకు ఎన్నో హామీలు ఇచ్చి, ముఖం చాటేసిన చంద్రబాబుకు గత ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు మంచి గుణపాఠం చెప్పారని పేర్కొన్నారు. ఒకపక్క రాష్ట్రాభివృద్ధి, మరోపక్క పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డిపై బురదజల్లే ప్రయత్నాలు మానుకుని అభివృద్ధికి సహకరించాలని ప్రతిపక్ష నేతలకు హితవు పలికారు.